TGTEL/25/A3750
... నిజమే ...
# నిజాయితి
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొడ్డుపల్లి మల్లయ్య సంపుటి 1 సంచిక 03 ప్రింటర్ : గుండూర్ శ్యామ్ . గురువారం 20 నవంబర్ 2025 వెల 4:00

"నిజాయితి" ఒక ముఖ్యమైన నైతిక లక్షణం ఇది విశ్వసనీయత, విధేయత మరియు సమగ్రతను పెంచుతుంది.



# తెలంగాణ మహిళలకు గుడ్‌న్యూస్.. కొత్త పథకంతో కోటి మందికి లబ్ధి

- తెలంగాణ మహిళలకు గుడ్‌న్యూస్
- ఇందిరమ్మ చీరల పంపిణీ
- పథకం ప్రారంభం
- కోటి మందికి చీరలు

**నిజాయితి, హైదరాబాద్ :**
తెలంగాణ ప్రభుత్వం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా 'ఇందిరమ్మ చీరల' పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. కోటి మంది మహిళలకు ఉచితంగా చీరలు అందించే ఈ పథకం ద్వారా వారి ఆత్మగౌరవాన్ని పెంచడమే లక్ష్యంగా పెట్టుకుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు. తెలంగాణ మహిళలకు రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ పాలన బలహీన వర్గాలకు సువర్ణ అధ్యాయమని, ఆమె పరిపాలన ఒక మోడల్ అని కొనియాడారు. ఇందిరా గాంధీ స్ఫూర్తితో తెలంగాణలో 'ప్రజాపాలన' అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరపున సారె పెట్టి గౌరవించాలనే ఉద్దేశంతోనే కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించామని వెల్లడించారు. ముందుగా గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ జయంతి రోజు అయిన నేడు ప్రారంభించి డిసెంబర్ 9 వరకు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 వరకు పంపిణీ చేయనున్నట్లు సీఎం రేవంత్ వెల్లడించారు.
చీరల ఉత్పత్తికి సమయం పడుతున్న నేపథ్యంలో మొదటి విడతలో 65 లక్షల చీరలు పంపిణీ చేస్తామని మొత్తం కోటి చీరలను రెండు విడతలుగా అందిస్తామని సీఎం స్పష్టం చేశారు. మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఇందిరమ్మ చీర కట్టుకొని ఆడబిడ్డల ఆత్మగౌరవానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారాలని ఆయన పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వంలో మహిళా సాధికారతకు, ఆర్థిక ఉన్నతికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో పేదలను మోసం చేసిందని విమర్శిస్తూ.. తమ ప్రభుత్వం మొదటి విడతగా రూ. 22,500 కోట్ల వ్యయంతో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని ప్రకటించారు. మహిళలకు పెట్రోల్ బంకులు నిర్వహించుకునేలా ప్రోత్సహించామని, ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలనే యజమానులను చేశామని తెలిపారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందిరా గాంధీ భూ సంస్కరణలతో పేదలకు భూపంపిణీ చేశారని.. ప్రపంచ దేశాల బెదిరింపులకు భయపడకుండా పాకిస్తాన్‌ను విడగొట్టి బంగ్లాదేశ్‌ను ఏర్పాటు చేశారని సీఎం గుర్తు చేశారు. రాజకీయాల్లోనూ మహిళలకు తమ ప్రభుత్వం తగిన ప్రాధాన్యత కల్పిస్తోందని ఆయన అన్నారు.

## ఆడపిల్లల రక్షణ నే మా లక్ష్యం
### -నాగర్‌కర్నూల్ షీ టీం ఎస్ఐ రజిత




**నిజాయితి, పెద్దకొత్తపల్లి :**
గంట్రావుపల్లి పెద్దకొత్తపల్లి మండలంలో ఆడపిల్లలు ఏ%శీ%దులోను తక్కువ కాదు, కొందరు కీచకులు అమ్మాయిలను వాళ్ళు వచ్చిపోయే టైంని గమనించి వారిని హేళన చేయడం, అవమానించడం, ప్రేమించమని ఒత్తిడి చేయడం చేస్తూ ఉంటారు, ఇలా ఎవరైనా అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, లైంగిక దాడికి పాల్పడిన అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని షీ టీం ఇంచార్జి రజిత హెచ్చరించారు. అమ్మాయిలు మహిళలు ఎవరికి ఏ ఇబ్బంది ఏదురైన వెంటనే షీ టీం నెంబర్ కి 8712657676 కాల్ చేయండి అంటూ షీ టీం ఏఎస్ఐ విజయ లక్ష్మి వివరించారు.
భరోసా కేంద్రం ద్వారా బాధితులకు పోలీసు సహకారమే కాకుండా న్యాయపరమైన, వైద్యపరమైన సహాయం అందించడంతో పాటు సానుకూల వాతావరణంలో వారికి అవసరమైన కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయి అని భరోసా కో ఆర్డినేటర్ శ్రీలత వివరించారు,
ఇతరుల మాయమాటలు నమ్మి.. చాలా మంది బాధితులు తమ జీవితాలు ప్రమాదపు అంచులోహ్యూమన్ ట్రాఫికింగ్ లో పడిపోతున్నారు, మన జిల్లాలో హ్యూమన్ ట్రాఫికింగ్ కూడా పని చేస్తోంది అని ఏహెచ్‌యు మెంబెర్ వివరించారు. ఈ కార్యక్రమంలో షీ టీం మెంబెర్స్ వెంకటయ్య, వెంకట్, స్కూల్ హెచ్ఎం భాస్కర్ రావు , టీచర్స్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో సజావుగా ధాన్యం కొనుగోళ్లు : మంత్రి జూపల్లి



**నిజాయితి, పెద్దకొత్తపల్లి :**
ధాన్యం కొనుగోళ్లు రాష్ట్రంలో వేగంగా, సజావుగా కొనసాగుతున్నాయని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. చిన్నంబావి, కొల్లాపూర్ మండలాల్లోని అయ్యవారిపల్లి. కొప్పునూర్, ఎన్మనబెట్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని మంత్రి అన్నారు. రైతులకు న్యాయమైన మద్దతు ధర, సమయానికి కొనుగోలు, పారదర్శక వ్యవస్థ అందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ప్రభుత్వం

2వ పేజీలో

## మహిళల అభ్యున్నతే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం, రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు




**నిజాయితి, నాగర్‌కర్నూల్ :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, మహిళా సమాఖ్య ప్రతినిధులతో కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం పై సమీక్ష సమావేశం సమావేశం నిర్వహించారు. నాగర్ కర్నూలు జిల్లా కలెక్టరేట్ నుండి రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సుకు హాజరయ్యారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.... ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రారంభించుకున్నాం, ఆడబిడ్డలకు సారె, చీర పెట్టడం తెలంగాణ సంప్రదాయం ఇందులో భాగంగా ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలను పంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది,
ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియకు సంబంధించి ప్రతీ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలి, నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో విడతల వారీగా ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టాలన్నారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మహిళా సంఘాలతో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను సుస్థిర ఆర్థిక వ్యాపారస్తులను తయారు చేయాలని ఉద్దేశంతోనే స్వయం సహాయక సంఘాల సభ్యులకు అనేక రకాల పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళలు రూపాయి రూపాయి కష్టపడి కూడబెట్టిన డబ్బును అనవసర ఖర్చులకు పెట్టకుండా, అవసరం ఉన్నప్పుడు మాత్రమే ఉపయోగించాలి, అలా చేస్తే అప్పుల భారంలో పడకుండా ఉంటారు అని చెప్పారు. ముఖ్యంగా మహిళలు కూడబెట్టుకున్న సంపదలను పిల్లల చదువుల పేరట ప్రైవేటు పాఠశాలలకు తన పిల్లలను చదివిస్తూ సంవత్సరానికి లక్ష రూపాయల వరకు ఖర్చు చేస్తున్నారని గ్రామంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో నిష్ణార్థులైన ఉపాధ్యాయుల సమక్షంలో విద్యాబోధన జరుగుతుందని మహిళా సంఘాలు గ్రామీణ మహిళలకు చైతన్యం పరిచి, ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లల్ని చేర్చే విధంగా చూడాలని మంత్రి తెలిపారు.
రాష్ట్ర ప్రభుత్వం మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా పెట్రోల్ బంకులు, ఆర్టీసీలో బస్సులు, వివిధ వ్యాపార సంస్థల్లో రాణించేలా ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందని మహిళలు అందిపుచ్చుకొని తమ వ్యాపార ఆలోచనలను అభివృద్ధి చేసుకొని ఆర్థికంగా రాణించాలని, ఖర్చు

2వ పేజీలో

## అంగన్వాడి రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి
### అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పార్వతమ్మ

**నిజాయితి, నాగర్‌కర్నూల్ :**
ఈనెల 25 26వ తేదీలలో ఆదిలాబాద్ లో జరిగే తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పార్వతమ్మ పిలుపునిచ్చారు
ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన అంగన్వాడి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కనీస వేతనం ఉద్యోగ భద్రత గ్రాటిటీ పెన్షన్ తదితర సమస్యల పరిష్కారం కోసం రాబోయే కాలంలో చేపట్టవలసిన కర్తవ్యాలు పోరాటాల నిర్మాణం కోసం ఈ రాష్ట్ర మహాసభల్లో చర్చించి భవిష్యత్తు ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చే విధంగా మహాసభలు నిర్వహిస్తున్నామని ఆమె అన్నారు. కేంద్ర రాష్ట్ర



ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడులు రద్దు కోసం నూతన జాతీయ విద్యా విధానం పైన పోరాట నిర్వహించడానికి అంగన్వాడి టీచర్లు హెల్పర్లు సిద్ధంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు.. అంగన్వాడి వ్యవస్థ ఏర్పడి దాదాపు 60 ఏళ్లు కావస్తున్న కేంద్ర ప్రభుత్వం గతంలో 100% నిధులు ఇస్తే ఇప్పుడున్న బీజేపీ ప్రభుత్వం వాటిని 60 శాతానికి తగ్గించి అంగన్వాడి వ్యవస్థను విచ్ఛిన్నం చేయడానికి పూనుకున్నదని ఆమె అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని భవిష్యత్తులో జరిగే పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని ఈ మహాసభల వేదికగా చర్చించి భవిష్యత్తు పోరాటాల రూపొందిస్తామని ఆమె సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పొదిల రామయ్య అంగన్వాడీ వర్కర్స్ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాసమ్మ అలివేల చిట్టెమ్మ లక్ష్మి కృష్ణవేణి భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు



## కల్వకుంట్ల కవిత అరెస్ట్.. నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలింపు

**నిజాయితి, హైదరాబాద్ :**
హైదరాబాద్‌లో తీవ్ర ఉద్రిక్తతల మధ్య కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్ట్ చేశారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జాగృతి నేతలతో కలిసి నాంపల్లి సింగరేణి భవన్‌ను ముట్టడించే ప్రయత్నం చేయగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ పోలీసులు, జాగృతి నేతలు, కార్యకర్తలకు తీవ్ర వాగ్వాదం.. తోపులాట జరిగింది. దీంతో కవిత సహా జాగృతి నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు.. వారిని నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్ అయ్యారు. సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించడం కోసం బుధవారం నాంపల్లిలోని సింగరేణి భవన్‌ను తెలంగాణ జాగృతి నేతలు, హెచ్ఎంఎస్ కార్యకర్తలు కలిసి ముట్టడించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో కలిసి ఆటోలో కవిత చేరుకున్నారు. డిపెండెంట్ ఉద్యోగాలను పునరుద్ధరించాలని.. మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో సింగరేణి భవన్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే తోపులాట అనంతరం కవిత సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలోని బొగ్గు బ్లాకుల వేలాన్ని వెంటనే నిలిపివేయాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కొత్త బ్లాకులను కేవలం సింగరేణికి మాత్రమే కేటాయించాలని పేర్కొన్నారు. ఇది సింగరేణి సంస్థ ఆర్థిక స్థిరత్వానికి చాలా ముఖ్యమని తెలిపారు. సింగరేణి పరిధిలోని ప్రతి కాంట్రాక్ట్‌లో 25 శాతం అవినీతి జరుగుతోందని ఆరోపించిన కల్వకుంట్ల కవిత.. అందులో 10 శాతం వాటా కాంగ్రెస్ నాయకులకు వెళ్తోందని చేసిన ఆరోపణలు సంచలనం సృష్టిస్తున్నాయి. ఈ అవినీతి ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం స్పందించకపోతే తాము సీబీఐకి ఫిర్యాదు చేస్తామని తీవ్ర హెచ్చరికలు చేశారు. సింగరేణి కార్మికుల జీతాల నుంచి ఆదాయపు పన్ను వసూళ్లను నిలిపివేయాలని.. తద్వారా కార్మికులపై ఆర్థిక భారం తగ్గుతుందని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. రెండేళ్లుగా మెడికల్ బోర్డు కోసం తెలంగాణ జాగృతిగా తాము పోరాటం చేస్తున్నామని.. ఇది కార్మికుల ఆరోగ్యానికి అత్యవసరమని కల్వకుంట్ల కవిత తెలిపారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా.. ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలను తీసివేయడం దారుణమని మండిపడ్డారు. కార్మికుల సమస్యలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని.. లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని కవిత తీవ్రంగా హెచ్చరించారు. జాగృతి జనం బాట పేరుతో ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కల్వకుంట్ల కవిత యాత్ర చేస్తున్నారు. రాష్ట్రం మొత్తం నిర్వహించనున్న ఈ యాత్ర ప్రతీ జిల్లాలో 2 రోజుల చొప్పున జరగనుంది. మొత్తం 4 నెలల్లో తెలంగాణ అంతటా ఈ యాత్ర సాగనున్నట్లు జాగృతి నేతలు స్పష్టం చేశారు.

## మహిళల అభ్యున్నతే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయం,

మొదటి పేజీ తరువాయి

ఖర్చు చేసేటప్పుడు తెలివిగా ఆలోచన చేసి ఖర్చు చేయాలని మంత్రి ఈ సందర్భంగా మహిళా సంఘాలకు సూచించారు. ప్రభుత్వ తోడ్పాటుతో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించడమే కాకుండా సామాజికంగా కూడా ప్రగతి పథంలో పయనించేలా సమాఖ్యలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ..... రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు ఉచితంగా డ్రెస్ కోడ్ మాదిరిగా తెలంగాణ ప్రభుత్వం సిరిసిల్లలో చేనేత కార్మికులతో రూపొందించిన చీరలను పంపిణీ చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ఇందిరమ్మ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలని ఉద్దేశంతోనే మహిళలకు వివిధ రకాల వ్యాపార రంగాల్లో రాణించేలా కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా మహిళల అభ్యున్నతికి కృషి చేసేలా ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతోపాటు బస్సులకు ఓనర్లను చేస్తుందని తెలిపారు. గృహ అవసరాలకు ఉచిత విద్యుత్తు, 500 కు సిలిండర్, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందిస్తూ మహిళల అభ్యున్నతికి పాటుపడుతుందని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని సూచించారు.

నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ..... నాగర్ కర్నూలు జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా 1,68,104 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారని మహిళలు అందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా" మహిళల ఉన్నతి, తెలంగాణ ప్రగతి" పేరుతో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని రూపొందించిన ఉచిత చీరల పంపిణీని సమర్థవంతంగా నిర్వర్తించేందుకు అధికారులు సమర్థవంతమైన ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ సూచించారు.

ప్రతి స్వయం సహాయక సంఘాల సభ్యులందరికీ ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారి ని రూపొందించి ప్రతి నియోజకవర్గం పరిధిలోని ప్రజాప్రతినిధుల సమక్షంలో చీరల పంపిణీ సమర్థవంతంగా నిర్వర్తించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి పారదర్శకంగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకుంటుందని, ఎలాంటి విమర్శలు, పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర పంపిణీ అయ్యేలా సమాఖ్య ప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. ప్రతి మహిళకు చీరలు అందించే రానున్న సంక్షేమ పథకాల లబ్ధికి చేకూరేలా సహాయ సహకారాలు అందుతాయని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, నాగర్ కర్నూల్ జిల్లాలోని 20 మండలాలకు చెందిన స్వయం సహాయక సంఘాల అధ్యక్షులు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో సజావుగా ధాన్యం కొనుగోళ్లు : మంత్రి జూపల్లి

మొదటి పేజీ తరువాయి

ధాన్యం కొనుగోళ్లు రాష్ట్రంలో వేగంగా, సజావుగా కొనసాగుతున్నాయని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. చిన్నంబావి, కొల్లాపూర్ మండలాల్లోని అయ్యవారిపల్లి. కొప్పునూర్, ఎన్మనబెట్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని మంత్రి అన్నారు. రైతులకు న్యాయమైన మద్దతు ధర, సమయానికి కొనుగోలు, పారదర్శక వ్యవస్థ అందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ.2389/- సాధరణ రకానికి రూ. 2369/- మద్దతు ధర కల్పిస్తుందని, సన్నాలకు రూ. 500 బోనస్ ఇస్తుందని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని, మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. . కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, ప్రణాళికా బద్ధంగా ధాన్యం కొనుగోలు జరగాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

కొల్లాపూర్ నియోజకవర్గంలో మహిళ సమాఖ్య సంఘాల ఆద్వర్యంలోనే వరి ధాన్యం కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకం ధాన్యం 17శాతం తేమ ఉన్నా కొనాల్సిందేనని స్పష్టం చేశారు. ధాన్యం తూకం అయిన వెంటనే రైతుకు రసీదు ఇవ్వాలని, ఆ తర్వాత ధాన్యం తరలింపు విషయంలో రైతుకు ఎలాంటి సంబంధం ఉండదని, మిల్లుకు తరలించే బాధ్యత పౌర సరఫరాల, వ్యవసాయ శాఖ అధికారులదేనని వెల్లడించారు.

# కుమ్మర వాములు కూల్చొద్దు

## - రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడుకొండల వెంకటేశం



**నిజాయితి, నల్లగొండ :** కుమ్మర వాములు కూల్చొద్దు అని డిమాండ్ చేసిన రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడుకొండల వెంకటేశం తేదీ 19-11-2025 బుధవారం రోజున కుమ్మర వృత్తిదారుల సంఘం. గ్రామం రేగట్టే, కనగల్లు మండలం, నల్లగొండ జిల్లా, తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షులు నడికుడా జయంత్ రావు గారి నాయకత్వంలో, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి దయానంద్, రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం గారాలు, మరియు రాష్ట్ర కమిటీ సూచనలతో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడుకొండల వెంకటేశం, నల్లగొండ జిల్లా కన్వీనర్ రాధారపు బిక్షపతి, కో- కన్వీనర్ గంగాధరి వెంకటేశ్వర్లు, గార్ల ఆధ్వర్యంలోలి రెగట్టే లిగ్రామ కుమ్మర వృత్తిదారుల సంఘం కులస్తులు,గ్రామ కులస్తుల సమక్షంలో కుమ్మరి వాములను సందర్శించడం జరిగింది, గత కొద్ది రోజుల క్రితం ప్రభుత్వ అధికారులు కుమ్మరి కులస్తులను

పిలిపించి కుమ్మరి వాముల వద్ద అంగడి వాడి స్కూలు భవనము కొరకు గత కొద్ది రోజుల కింద గ్రామ కమిటీ తీర్మానం చేసినది కావున భవనము శాంక్షన్ అయింది ఈ స్థలములో కొంత భాగం అంగడి వాడి స్కూలు భవనం కొరకు కుమ్మరి కులస్తులు సహకరించగలరని తెలియపరిచినారు అప్పుడు వెంటనే అందుబాటులో ఉన్నవారు ఇక్కడ నిర్మాణం చేయొద్దు ఈ గ్రామంలో చాలా చోట్ల ఖాళీ భూములు ఉన్నాయి అక్కడ చేసుకోండి అని తెలియపరిచినారు అయినా అధికారులు వినకుండా త్వరలో ఈ స్థలంలో కొంత భాగం అంగడి వాడి స్కూలు భవనం కట్టబోవుచున్నామని తెలియపరచి వెళ్ళిపోయినారు, వెంటనే గ్రామ వార్డు మెంబర్ మన కుమ్మరి ముద్దుబిడ్డ దొమ్మాటి కొండయ్య, గ్రామ శాఖ సభ్యుడు దొమ్మాటి శేఖర్ గ్రామ కులస్తులు తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం జిల్లా నాయకులకు, రాష్ట్ర నాయకులకు, రేగట్టే కుమ్మరి వాముల సమస్య తెలియపరచి ఈరోజు మా గ్రామానికి వచ్చి మా కుమ్మరి వాములను కాపాడాలని విన్నవించుకున్నారు, ఇట్టి విషయంలో రాష్ట్ర జిల్లా నాయకులు కుమ్మరివాముల దగ్గరికి వెళ్లడం జరిగింది, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏడుకొండల వెంకటేశం మాట్లాడుతూ తాత ముత్తాతల నుండి చాలా సంవత్సరాల క్రితం పడవబడిన భూములను చెట్లు, రాళ్లు, రప్పలు, కంప, ఎగుడు దిగుడుగా ఉన్న భూమి చదును చేసుకుని కుమ్మరివాములు

నిర్మించినారు ఇట్టి కుమ్మరి వాములో కుండలు కాల్చుచున్నారు అక్కడ ఉన్న వాములు మన కులస్తులు వృత్తి పని చేసుకుంటూ జీవనోపాధి చేస్తున్నారు, కుమార్ల జీవనోపాధికి ఉన్న కుమ్మరి వాములు కులుచవద్దు . సబండ కులాలకు మనిషి పుట్టిన దగ్గర నుండి చనిపోయే వరకు కుండలు అందించే వారము కుమ్మరి వారము కుమ్మరి వృత్తిని కాపాడుటకు ప్రభుత్వ అధికారులు సహకరించగలరని మరొక చోట ఈ గ్రామంలో అంగడి వాడి స్కూలు నిర్మాణం చేసుకోగలరని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాము ఇట్టి వాముల జోలికి రాకుండా ఉండి వాములు ఉన్న స్థలాన్ని రేగట్టే కుమ్మరి కులస్తుల గ్రామ శాఖకు పట్టాలు ఇవ్వాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు, 148 జిఓ ప్రకారంగా రేగట్టే గ్రామ కులస్తులకు ఆధునిక పరికరాలు అందించి ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి వారిని చైతన్య పరచాలని ప్రభుత్వ అధికారులకు విన్నవించడం జరిగింది . ఇట్టి కార్యక్రమానికి హాజరైన నల్లగొండ జిల్లా కమిటీ సభ్యులు తాడూరు చంద్రం, ఆరూరి బాల నర్సయ్య, జిల్లా యువత విభాగం అధ్యక్షులు ఏరుకొండ హరి, నల్లగొండ నియోజక వర్గం ఇన్చార్జి నిమ్మన గోటి శ్యాంప్రసాద్, మునుగోడు నియోజకవర్గం ఇన్చార్జి చిలువేరు సత్తయ్య, కనగల్లు మండలం మాజీ

అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాస్, తొమ్మాటి కొండయ్య, దొమ్మాటి శేఖర్ దోమ్మాటి మల్లికార్జున్, దొమ్మాటి శ్రీనివాసులు,గ్రామ మహిళలు కులస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులను ఉత్సాహ పరిచిన ఎమ్మెల్యే




**నిజాయితి, నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ మండల్ తూడుకుర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి కో-కో (యు/17) బాల, బాలికల క్రీడా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి విద్యార్థులను ఉత్సాహపరిచారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం, జట్టు భావన పెంపొందిస్తాయని పేర్కొంటూ, గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్రీడలకు ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ఈ కార్యక్రమంలో, నాగర్ కర్నూల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు గారు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ గారు, మండల్ ప్రెసిడెంట్ కోటయ్య గారు , ఎంఈఓ గారు,డిఈఓ గారు,పట్టణ మాజీ కౌన్సిలర్లు మరియు నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఉపాధ్యాలు , విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

**అనంతరం** తుడుకర్తి గ్రామంలో పిఏసిఎస్ వారి ఆధ్వరం లో చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు న్యాయమైన ధర లభించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం ఈ కొనుగోలు కేంద్రాల్లో ఏ గ్రేడ్ వరికి క్వింటాల్‌కు ?2389, అలాగే సాధారణ రకం (సి గ్రేడ్) వరికి రూ.2369 చొప్పున చెల్లింపు జరగనున్నదని వివరించారు. రైతులు ఎలాంటి మధ్యవర్తులపై ఆధారపడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా తమ ధాన్యాన్ని విక్రయించాలని ఎమ్మెల్యే సూచించారు. పంట సేకరణలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి రైతుకూ సమయానికి చెల్లింపులు జరిగేలా వ్యవస్థను పటిష్ఠం చేస్తున్నామని తెలిపారు. అలాగే ఈ సీజన్‌లో రైతులు పంట నాణ్యతపై దృష్టి పెట్టాలని, ప్రభుత్వం అందించే సౌకర్యాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి ,మండల్ ప్రెసిడెంట్ కోటయ్య , మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు గారు,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ ,మాజీ కౌన్సిలర్స్, డైరెక్టర్లు, వ్యవసాయ అధికారులు, రెవిన్యూ అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..



## ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి - బివిస్పీ.

**నిజాయితి, తెల్కపల్లి :** ఇ రోజు బహుజన సమాజ్ పార్టీ(బిఎస్పీ) ఆధ్వర్యంలో తెల్కపల్లి మండల తహసీల్దార్, ఎస్సై గార్లకు మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఇ కార్యక్రమంలో బిఎస్పీ మాజీ రాష్ట్ర ఈసీ మెంబర్ పృథ్వీరాజ్, జిల్లా ఇంచార్జ్ సి.కళ్యాణ్ లు మాట్లాడుతూ నడిగడ్డ, రామగిరి గ్రామాలలో రాత్రి 10దాటిన తర్వాత ట్రాక్టర్లు, టిప్పర్ లతో దుందుబి వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకున్న ఇసుకను అక్రమ మార్గాల్లో రవాణా చేస్తున్నారని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై మండల తహసీల్దార్ కార్యాలయం, మండల పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి అనుమతులు లేకుండా కొడుతున్న ఇసుకను అరికట్టాలనీ కోరారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో నకిలీ లబ్ధిదారులు ఇసుకను రవాణా చేస్తున్నారని మండిపడ్డారు. నడిగడ్డ, రామగిరి గ్రామాలలో రాత్రి వేళల్లో పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని అన్నారు. ఇ కార్యక్రమంలో మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి హర్ష ముదిరాజ్, ఈసీ మెంబర్ నాగరాజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తా - రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత

**నిజాయితి, అచ్చంపేట :** ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తానని రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత పేర్కొన్నారు మంగళవారం అచ్చంపేట నియోజకవర్గం పల్కపల్లి శివాలయం ప్రాంగణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ ఆర్యవైశ్యులలో ఎంతోమంది నిరుపేదలు ఉన్నారని కార్పొరేషన్ ద్వారా వారికి సహకారం అందజేస్తామని అన్నారు ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, అనురాధ, అచ్చంపేట నియోజకవర్గంలోని వైశ్యులకు కమ్యూనిటీ భవనాలు, మరియు మద్ది మడుగులో సత్రం నిర్మాణానికి రెండు ఎకరాల భూమిని కేటాయించడం అభినందనీయమని అన్నారు మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులు లక్ష్మీనారాయణ కార్యవర్గాన్ని శాలువాలతో ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో రాష్ట్ర మహాసభ విద్యా కమిటీ చైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్, నాగర్ కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, విసనకరల చంద్రకుమార్, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్,, ఆర్యవైశ్య సంఘం నాయకులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు అనంతరం ప్రత్యేక పూజలు సామూహిక వనభోజనాలు నిర్వహించారు





## నూతన ఎస్సైని సన్మానించిన కాంగ్రెస్ పార్టీ, ఐ ఎన్ టీ యూ సి నాయకులు

**నిజాయితి, అచ్చంపేట :** అచ్చంపేట పట్టణానికి ఇటీవలే ఎస్సై గా బాధ్యతలు తీసుకున్న సబ్ ఇన్స్పెక్టర్ సద్దాం హుస్సేన్ గారిని బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో మర్యాద పూర్వకం గా కలిసి శాలువ తో సన్మానించిన ఐ ఎన్ టీ యూ సి తాలూకా అధ్యక్షులు మహబూబ్ అలీ, ఐ ఎన్ టీ యూ సి అచ్చంపేట టౌన్ అధ్యక్షులు ఎండీ గౌస్ పాష, ఐ ఎన్ టీ యూ సి మండల ఉపాధ్యక్షులు మౌలానా, సేవాదళ్ తాలూకా అధ్యక్షులు జగదీశ్వర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు.

# పార్టీ పేరుతో ఇచ్చే 42% బిక్షం బీసీ రిజర్వేషన్ వద్దు చట్టబద్ధంగా రిజర్వేషన్లను అమలు చేయాలి



ఎన్డీఏ బిజెపి కేంద్ర ప్రభుత్వం శీతాకాల సమావేశాల్లో బీసీల 42/శాతాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టాలి, లేనియెడల నేను బిసి నీ అనీ చెప్పుకునే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజీనామా చేయాలి

సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మారేడు శివశంకర్ డిమాండ్



**నిజాయితి, నాగర్‌కర్నూల్ :**
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో, బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నల్ల జెండాలు, నల్ల రిబ్బన్లతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీసీ రిజర్వేషన్ల చట్టం ఆమోదం పొందిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలని నేతలు స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా మ్యాకల శివశంకర్ యాదవ్ మాట్లాడుతూ
"పార్టీ గుర్తుల్లేని ఎన్నికల్లో పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇవ్వడం అంటే బీసీలకు బిక్షం ఇచ్చినట్టే. ఈ అవమానాన్ని బీసీ సమాజం ఏ విధంగానూ భరించదు. బీసీ రిజర్వేషన్ల చట్ట సభల ఆమోదం పొందిన తర్వాతనే సర్పంచ్ ఎన్నికలు జరగాలి. పార్టీ గుర్తుల్లేని ఎన్నికల్లో 'పార్టీ పరంగా 42%' అనడం హాస్యాస్పదం. ఇది తెలంగాణలో సర్పంచ్ నుండి సీఎం వరకు 'రెడ్డి రాజ్యం' కొనసాగించేందుకు పన్నిన కుట్ర" అన్నారు.
కేంద్ర%-%రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే బీసీ ఉద్యమం తీవ్రరూపం దాలుస్తుందని హెచ్చరిస్తూ
"42% ప్రకటించి, అగ్రకులాలకు ఇండిపెండెంట్‌గా పోటీ చేసే అవకాశం ఇవ్వడం బీసీల ఓటును చీల్చే కుట్ర. తెలంగాణ అంతటా బీసీల రాజకీయ ప్రతినిధిత్వాన్ని బలహీనపర్చేందుకే ఈ వ్యూహం" అని ఆరోపించారు.

**అలాగే,**
"మూడు కోట్ల బీసీల ఆశలు ముఖ్యమా? 3000 కోట్లు ముఖ్యమా?" అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న "3000 కోట్లు నిలిచిపోతాయి" అనే కారణాన్ని ఆయన తప్పుబడుతూ "రాష్ట్ర బడ్జెట్ రూ.2,40,000 కోట్లలో 3000 కోట్లు ఒక్క శాతం కూడా కావు. మెగా కృష్ణారెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లాంటి కాంట్రాక్టర్లకు ఇచ్చిన వాటిలో 3000 కోట్లు ఒక ఆవగింజ కూడా కావు. అవసరమైతే మూడు కోట్ల బీసీలు ఒక్కొక్క రూపాయి ఇచ్చి ఆ 3000 కోట్లు సేకరిస్తాం. కానీ మా హక్కు అయిన 42% రిజర్వేషన్‌పై ఎలాంటి రాజీ ఉండదు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.
అఖిలపక్ష నేతలతో కలిసి ఢిల్లీకి వెళ్లి ప్రధానిపై ఒత్తిడి తీసుకురావాలని, ఇండియా కూటమి ఎంపీలు పార్లమెంట్‌ను డిసెంబర్ మొదటి వారంనుండే స్తంభింపజేయాలని డిమాండ్ చేశారు.
"బీసీ రిజర్వేషన్ల చట్టం వెంటనే ఆమోదించాలి. లేకపోతే రాష్ట్రం, కేంద్రం రెండింటిపై బీసీ పోరాటం అగ్నికీలలలా చెలరేగుతుంది" అని హెచ్చరించారు.

**కార్యక్రమంలో పాల్గొన్న బీసీ నాయకులు,**
దాసర్ల వెంకట స్వామి, అరవింద చారి, కుంభం మల్లేష్ గౌడ్, జాలం కాసిం యాదవ్, అంతటి రాజేందర్ గౌడ్, వేముల సత్యశీల సాగర్, అబ్బ కరుణాకర్, మ్యాకల యాదయ్య, సూరంపల్లీ సుధాకర్, పెబ్బేటి నిరంజన్, రఘుబాబు
బిఎస్‌పి నాయకులు కళ్యాణ్
సిపిఐ జిల్లా నాయకుడు శివశంకర్‌బీ
సిపిఎం జిల్లా నాయకులు ఆర్ శ్రీనివాసులు
డిఎస్‌పి నాయకుడు సాయి మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

# 42 శాతం రిజర్వేషన్లు

## పార్టీపరంగా వద్దు - చట్ట పరంగా ముద్దు

## జేఏసి అధ్యక్షులు అరవిందాచారి,సిపిఎం ఆర్ శ్రీను



**నిజాయితి, నాగర్‌కర్నూల్ :**
పార్టీపరంగా 42 శాతం రిజర్వేషన్లు మాకు వద్దు..
లిబీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి లిలి...
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో బుధవారం రోజున అంబేద్కర్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ నిర్ణయం తర్వాత పార్టీపరంగా 42% రిజర్వేషన్లు ఇస్తామనడం పట్ల పలు బీసీ సంఘాలు నల్ల బ్యాడ్జీలతో నిరసనలు తెలియజేశారు. చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్లతోననే స్థానిక సంస్థల ఎలక్షన్లు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకువెళ్లి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ చేస్తూ నైన్త్ షెడ్యూల్లో పెట్టి చట్టబద్ధత చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో స్థానిక ఎలక్షన్లను నిర్వహించబోమని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బీసీ జేఏసీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, అఖిలపక్ష పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తే

# కఠిన చర్యలు తీసుకుంటాం,


## - జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నిజాయతి, నాగర్‌కర్నూల్ :**
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో వెనుకబడిన మండలాల అధికారులపై నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.
బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం తో కలిసి ఎంపీడీవోలు, గృహ నిర్మాణ శాఖ ఏలు, ఎంపీఓలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు గ్రౌండింగ్ పై నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.
ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై కలెక్టర్ పలువురు ఎంపీడీవోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు, ముఖ్యంగా నిర్మాణ పనులలో వెనుకబడిన అధికారులపై మండిపడ్డారు.
ఈ విషయమై కలెక్టర్ వివిధ మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించి, మంజూరు చేసిన ఇళ్లలో ఎన్ని గ్రౌండింగ్ అయ్యాయి, ఎన్ని నిర్మాణ దశలో ఉన్నాయి వంటి వివరాలను మండలాలు గ్రామాల వారీగా అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయడానికి, గ్రౌండింగ్ కాని ఇళ్లలో పనులు నవంబర్ 30 లోగా ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంపీడీవోలను ఆదేశించారు.
పనుల పురోగతిపై నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సందర్భంగా హెచ్చరించారు.
అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ఇండ్లను వెంటనే గ్రౌండింగ్ చేసి ఆన్లైన్లో నమోదు ప్రక్రియను వేగంగా నమోదు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.
నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని పూర్తి అయిన ఇండ్లకు ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు అయ్యేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు.
జిల్లాలో ఇప్పటివరకు పూర్తయిన ఇండ్ల వివరాలు ఈ నెలలో ప్రారంభం కానున్న ఇండ్ల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.
ఈ సమావేశంలో అదనపు జిల్లా పరిషత్ సీఈవో గోపాల్ నాయక్, గృహ నిర్మాణ శాఖ అధికారి సంగప్ప, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేసరి సముద్రం లో చేప పిల్లలను వదిలిన ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

**నిజాయితి, నాగర్‌కర్నూల్ :**
నాగర్‌కర్నూల్ పట్టణం కేసరి సముద్రంలో రాష్ట్ర ఫిషరీస్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి బుధవారం చేపపిల్లలను వదిలారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...
గత ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా 100% నాణ్యమైన చేప పిల్లల పంపిణీ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. ఈ సంవత్సరానికి గాను నియోజకవర్గ వ్యాప్తంగా 91.64 లక్షల చేపపిల్లలను వివిధ చెరువులలో వదలనున్నామని ఆయన వివరించారు.
మత్స్యరంగ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి 123 కోట్లు కేటాయింపు ద్వారా ముదిరాజుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే అన్నారు.
చెప్పిన మాటకు కట్టుబడి మంత్రివర్గంలో ముదిరాజ్ బిడ్డకు స్థానం కల్పించిన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందని బడుగు బలహీన వర్గాలు, మరియు మహిళల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని ఆయన తెలిపారు.



ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు సంభంధిత అధికారులు, నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, పట్టణ మాజీ కౌన్సిలర్లు మరియు నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముదిరాజ్ నాయకులు, ప్రజలు పాల్గొనడం జరిగింది.

## జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ టౌన్ ట్యాంక్బండ్ మీద స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన ట్రాఫిక్ ఆర్ఎస్ఐ కళ్యాణ్



**నిజాయితి, నాగర్‌కర్నూల్ :**
నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ టౌన్ ట్యాంక్ బండ్ రోడ్డు పైన ట్రాఫిక్ ఎస్ఐ కళ్యాణ్ ఆయన సిబ్బందితో కలిసి బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది ఈ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ట్యాంకు బండ్ మీద ఆటోలు మరియు క్రూజర్లు ఆయా వాహనాల కెపాసిటీని మించి రోజువారీ పనులకు వెళ్లే కూలీలను ఎక్కించుకొని అనునిత్యం ఆయా ప్రాంతాలకు చేరవేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు తెలిసిందన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రెండు ఆటోలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగింది. అలాగే మీరు ఇలాగా ఆటోలలో వెళితే మీకు ప్రాణాపాయం ఉంటుందని వ్యవసాయ కూలీలకు మరియు ఇతర ప్రయానికులకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అవగాహన కల్పించినట్లు ట్రాఫిక్ ఆర్ఎస్ఐ కళ్యాణ్ తెలిపారు.